# వేద ఛందస్సు

నిరంతరము మనలో ఊహలు పుట్టుచున్నవి గదా! అందులో కొన్ని వట్టి వ్యాఖ్యానములు. మరికొన్ని నిర్ణయములు. ఈ ఊహలు, కోరికలు నిర్ణయములే మన ప్రవర్తనకు, జీవితగౌరవమునకు, భాగ్యమునకు కారణములగుచున్నవి గదా! కాని పుట్టిన ఏ ఊహలు భావికాలమున భాగ్యమును పంచునో, ఏ ఊహలు సఫలములై గౌరవమును పెంపొందించునో, ఊహ పుట్టినవేళ చెప్పలేకున్నాము. ఊహలు వచ్చుటయు మన అధికారములో లేదు. ప్రస్తుత స్థితినుండి ఉత్తమస్థితికి పోవలెనెనినచో, మనకు కలిగెడు ప్రతిఊహయును లాభకారిగా నుండవలెను. ఒక్క చెడ్డ ఊహ వచ్చినను, కొంతవరకు దిగజార్చును. ముందుకు సాగుట త్వరగా జరుగదు. ఈ ఊహలెచ్చట పుట్టుచున్నవి? జన్మకారణమైన మూలజ్ఞానమునందు పుట్టుచున్నవి. మన జ్ఞానమునందు మూడు పొరలున్నవి. వానికి సంజ్ఞానము, విజ్ఞానము, ప్రజ్ఞానము అని వేదమిడిన పేర్లు.

**సంజ్ఞానమ్, విజ్ఞానమ్, ప్రజ్ఞానమ్, జ్ఞానదభిజానత్** – తైత్తిరీయ బ్రాహ్మణము (3–10–1).

సంజ్ఞానము మూలజ్ఞానము. అన్నిటికన్న లోపలనున్నది. సంజ్ఞాన మన్త్రములు ఋగ్వేద దశమమండలమందు 196, 197 సూక్తములందున్నవి.

ఆ మూలజ్ఞానము పెరిగినపుడు కదా, ఆ పుట్టు ఊహలు మెరుగగుట. మన జ్ఞానమునందు అట్టడుగున ఉన్న భాగము పెరగవలెను. పైపై పొరలందలి జ్ఞానముతోడ పైపై పనులు చేయుచున్నాము. పైపై అనుభవములు మూల జ్ఞానమును జేరవు. జీవిత ప్రధానమైనవిః మనస్సు, ప్రాణములను పట్టి కుదించిన అనుభవములే మూలజ్ఞానమును జేరును.

ఆ అనుభవముల వలననే మన ప్రవర్తన కొంత మారును. ఆ మూలజ్ఞానమును గురించి ఆలోచించినచో, ఆ జ్ఞానమే మనమా, అనిపించును. మన జీవనపథము, దృక్పథము, మన ఊహలు మారవలెనెనినచోఆ మూల జ్ఞానము కదలవలెను. అది జన్మకు సంబంధించినది. దానిని గొప్పవక్తల ఉపన్యాసములు, మహా రచయితల గ్రంథములు, మతాచార్యుల బోధలు, నీతి గ్రంథములు – ఏవియును మార్చలేవు. ఆ జ్ఞానమును మార్చగలుగుట మానవ సాధ్యమయినచో, శంకరభగవత్పాదుల రచనలు మనలందరను ఎప్పుడో విరాగులను చేసెడివి. బుద్ధుని ప్రవచనములు చదివిన తరువాత యీ ప్రపంచమునందు హింస యన్న మాట ఉండెడిది కాదు.

పెరమానవుల మాటలను పెడచెవిని పెట్టెడి ఆ జ్ఞానము యొక్క స్వరూపమెట్టిది? దానియందు పుట్టు ఊహలను మార్చుట ఎట్లు సాధ్యము? ఆ జ్ఞానము చేరు మార్గమేమిటి?

వేదము ప్రతి మానవుని, తానున్న స్థితినుండి, ఉత్తమ స్థితికి చేర్చుటకు అవతరించినదిగాన, వేదస్వరూపము తెలిసినచో, ఆ మూలజ్ఞాన స్వరూపము వేదమేవిధముగా ఆ జ్ఞానమును మార్చుటకు సాధ్యపరచినదో తెలియును. ఎవరికి వారికా జ్ఞానమును జేరు మార్గముగూడ తెలియును.

వేదాధ్యయనమను యజ్ఞముచేత, వేదమన్త్రములు మూలజ్ఞానమును చేరి, క్రమక్రమముగా దానిని మార్పు జేయుచున్నవి. ఆ జ్ఞానమునకు, ఈ సృష్టి యొక్క సర్వజ్ఞానమును క్రమముగా తెలియజెప్పి, ఆ జ్ఞానమును అభివృద్ధి సేయుచున్నవి. మూలజ్ఞానము పెరిగినకొలది, అందు పుట్టెడి ఊహలు, క్రమముగా భాగ్యవంతములై, ప్రవర్తనను మార్పు చెందించుచున్నవి. సృష్టి స్వరూపము అవగతమగుచుండుట వలన, మానవుడు అల్పభావమును వదలి, ఉత్తమ భావనా మార్గములను చేపట్టుటకు వీలగుచున్నది. మానవులందరు ఒకే చైతన్యముయొక్క ప్రతిరూపములనిన నిశ్చయమునకు రాగలుగుచున్నాడు.

వేదాక్షరములు ఆ మూలజ్ఞానమున ఎట్లు చేరుచున్నవి? మనలో నున్న భావములనా మూలజ్ఞానము ఎట్లు వ్యక్తపరచుచున్నదో, వేదమును ఆ విధానమునే ఉపయోగించు చున్నది. మన జ్ఞానము, మనలోని భావములను ఎట్లు తెలియజేయుచున్నది? అక్షరములచేత. తన భావములకొరకైన మాటలకనువైన అక్షరములను ఒకటి తరువాత నొకటిగా బయటకు తెచ్చుచున్నది కదా! అక్షరయజ్ఞము చేత, జ్ఞానము, తన భావమును వెలికి తెచ్చుచున్నది. కనుక అక్షరయజ్ఞముచేతనే వేదమహాజ్ఞానము ఆ "జన్మజ్ఞానమును" చేరవలెను.

జన్మజ్ఞానము తన భావమును ప్రకటించుటకు అక్షర యజ్ఞమెక్కడ చేయుచున్నది? వాగ్యంత్రము (నోటి) యందు. ఆ అక్షరయజ్ఞమును గూర్చి తెలియవలెనినచో, ఆ యజ్ఞశాలను పరికింపవలెను.

**<u>అక్షర యజ్ఞశాల</u>**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ | క | చ | ట | త | ప | హ | య |
| ఇ | గ | జ | డ | ద | బ | ష | ర |
| ఉ | ఙ | ఞ | ణ | న | మ | శ | ల |
| | | | | | | స | వ |

(మన నోటియందు అక్షరములు పలికెడి స్థానములు పై నుండి క్రిందికి చూచినను, ఎడమనుండ కుడికి చూచిన ను, ఈ క్రమములో ఉండును. ఎవరికి వారు చూచుకొనవచ్చును).

1. ప్రధానమైన అచ్చులు మాత్రమే చూపబడినవి. తక్కిన అచ్చులు వీటి సంయోగము వలన కలుగును కదా (అ+ఇ=ఏ, అ+ఉ=ఓ, అ+ఏ=ఐ, అ+ఓ=ఔ)

2. క,ఖ; చ,ఛ; ట,ఠ......... ఈ జంట అక్షరములు పుట్టు చోటులొక్కటే. క – పలుకునపుడు గాలిని జోడించినచో ఖ–అగును. కనుక స్పర్శస్థానములు మాత్రమే చూపబడినవి.

ఈ యజ్ఞశాలయందు మూడుభాగములు కానవచ్చుచున్నవి కదా! ఎడమనుండి కుడికి చూచినచో, మొదటి భాగము అచ్చులు పుట్టుచోటు. రెండవభాగము స్పర్శలున్న స్థలము. మూడవభాగమునందు అంతస్థములు, ఊష్మములు చోటు చేసుకొన్నవి.

స్థలదృష్టితో కాక, అక్షరదృష్టితో చూచినచో, అచ్చులన్నియు ఒక మూలకు చేరినవి. స్పర్శలన్నియు గుంపుగా మరియొకచోటు చూచుకొనినవి. ఊష్మములు (హ, ష, శ, స), అంతస్థములు (య, ర, ల,వ) పై రెండు జాతి అక్షరములు కొంచెము వేరుగా కూర్చొని ఉన్నవి. ఆ కూర్చొనుటలో కూడ, (పైనుండి క్రిందికి) ఊష్మముల పీటల వరస వేరు. అంతస్థముల వరస వేరు.

అక్షరముల జన్మస్థానములను ఈ విధముగా పరచవలెనని ఎవరు నిర్ణయించిరో మనకు తెలియదు. ఈ వివిధ ములైన అక్షరములు పుట్టుటకు మనలో ఏఏ శక్తులు పని చేయుచున్నవో మనకు తెలియదు. కాని ఒక్కటి మాత్రము తథ్యము. ఈ ఏర్పాటు వలన మూలజ్ఞానము తన ఊహలను వ్యక్తపరచుటకు కావలసిన అక్షరములను వెంటవెంటనే సృష్టించుటకు సాధ్యమయినది. జ్ఞానమునందలి భావములను వ్యక్తీకరించుటకు, ప్రకటించుటకు వీలు కలిగినది. ప్రకటనము సాధ్యమయినది. ఈ ఏర్పాటును వేదము ఛందస్సు అనును.

ఒకానొక ఉత్తమ ప్రయోజనము కొరకు, దానికి కావలసిన సామగ్రిని సమర్థముగా, నేర్పుగా, ప్రయోజనమును నిస్సంశయముగా సాధించుటకు వీలుగా, ఏర్పరచుటను వేదము ఛందస్సు అనును. ఋక్కు ఛందస్సు. యజస్సు ఛందస్సు. సామ ఛందస్సు. ఛందస్సు కానిది వేదమునందుండదు.

ఉత్తమ ప్రయోజనమైన బ్రహ్మభావమును తెలియపరచుటకై చక్కగా నేర్పడి, చక్కగా రూపొందినట్టి సర్వము ను ఛందస్సే.

> **పృథివీ ఛన్దోఽన్తరిక్షం ఛన్దో ద్యౌశ్ఛన్దః**
> **సమాశ్ఛన్దో నక్షత్రాణి ఛన్దో మనశ్ఛన్దో**
> **వాక్ఛన్దః కృషిశ్ఛన్దో హిరణ్యంఛన్దో**
> **గౌశ్ఛన్దోఽజాఛన్దోఽశ్వఛన్దః** – కృష్ణయజు. (4–3–7)

ఇవి అగ్ని చయన మన్త్రములు. ఇందు పృథివి, అన్తరిక్షము, ద్యౌః, సమాః, నక్షత్రములు, మనస్సు, వాక్కు, కృషి, హిరణ్యము, గౌః, అజము – అన్నియు ఛన్దోరూపములని చెప్పబడినవి. పృథివి, అన్తరిక్షము మొదలైన వేద

శబ్దములకు సంస్కృతభాషలోని అర్థములు చెప్పరాదు.వాటి యర్థములేమైనను, అన్నియు ఛన్దోరూపములుగదా! ఒక ప్రయోజనార్థమై ఆయా రూపములు పొందినవిగదా! వేదమా ప్రయోజనమును, వాటి స్వరూపములను వివరించును.

అక్షరము ఛన్దోరూపము. ఎందుకనగా, మనస్సు, ప్రాణము, జ్ఞానము – అక్షరము పుట్టుచోటునందు క్రమ బద్ధముగా నిలబడి, అక్షరమును సృజించుచున్నవి. వేదము ఛందస్సు. ఎందుకనగా, అక్షరములను ఒక క్రమమైన పద్ధతిలో నేర్పరచి, వాటిని ఋక్కులుగా, యజస్సులుగా, సామలుగా నేర్పరచి, సృష్టిగతమహాజ్ఞానము (బ్రహ్మము) ను మన జన్మ జ్ఞానమునుజేర్చు విధానమేర్పరచినది. అందువలన వేదమే ఛందస్సు. ఛందస్సే వేదము.

వేదమందున్న జ్ఞానమును మన జ్ఞానమును చేరు విధానము వేదమెట్లు ఏర్పరచినది? యజ్ఞశాలను చూచినచో, 8 అక్షరములు ఒక వరసగా, మూడువరసలలో మనలోనున్న జ్ఞానము తన సర్వభావములను వెలిగ్రక్కుచున్నది. ఏదైన కొంచెము మిగిలినచో, పైన రెండక్షరములను (స,వ) ఉపయోగించుచున్నది. వేదము పాదమునకు 8 అక్షర ములుగా, మూడు పాదములతో గాయత్రి ఛందస్సును నిర్మించినది. వేదమునందిది మొదటి ఛందస్సు. గాయత్రీ ఛంద స్సు, అచ్చముగా యజ్ఞశాలకు ప్రతిరూపము.

వేదఛందస్సు అంతయు ఈ యజ్ఞశాలా స్వరూపమే. సకల సృష్టికి కారణమైన ఏ మహాచైతన్యము మన యందు అక్షర యజ్ఞశాలను నిర్మించినదో, ఆ మహాచైతన్యమే వేదఛంస్సును నిర్మించినది. ఒక సృష్టి మానవునియందు (micro). రెండవది బ్రహ్మాండమునందు (macro). నీరు, గాలి, ఏవిధముగా మానవుని యందును, బయటను ఉన్నవో, అటులనే అక్షరము, దాని ఛందస్సు మానవుని యందును, బయట వేదమునందును కనపడుచున్నవి.

ఋగ్వేదమునందలి ప్రథమ ఋక్కు గాయత్రీ ఛందస్సులో నున్నది.

అగ్నిమీళే పురోహితమ్ (8 అక్షరములు) యజ్ఞస్య దేవమృత్విజమ్ (8 అక్షరములు) హోతారం రత్న ధాతమ మ్ (8 అక్షరములు).

ఈ ఋక్కును అధ్యయనము చేయవచ్చును. ఇది ఒక పద్ధతి. రెండవ పద్ధతి, యజ్ఞశాలలోని నాల్గవ పాదము నందలి రెండక్షరస్థానములను గూడ ఋక్కునకు కలుపుట. వేదమునందు ఈ రెండక్షరములను నింపుటకు ప్రధానమైన శబ్దములున్నవి. అవి – స్వాహా, స్వధా, వషట్ – మొదలైనవి. అవి ప్రత్యేకముగా ఈ ప్రయోజనము కొరకే నిర్మింప బడినవి. దీనిని బట్టి వేద ఛందస్సునకును అక్షరయజ్ఞశాలకును ఎంత సంబంధమున్నదో తెలిసికొనవచ్చును.

అగ్నిమీళే ........... రత్నధాతమమ్ స్వాహా – అనిగూడ అధ్యయనము చేయవచ్చును. అగ్నిమీళే – అను ఋక్కులోని భావము నన్ను చేరుగాక, అని స్వాహా శబ్దమువలన అర్థము పెరిగినది.

యజ్ఞశాలలో అడ్డముగానున్నవి పాదములు, నిలువుగా నున్నవి వరుసలు, అని పిలిచినచో, యజ్ఞశాలలో ఎనిమిది వరుసలున్నవి. ఏడు , ఎనిమిది వరుసలలో మూడక్షరములు కాక, నాలుగు నాలుగు అక్షరములున్నవి. రెండును కలిసి ఎనిమిది అక్షరములు. ఒక పాదమునకు సరిపోవును. ఎనిమిది అక్షరములు ఒక్క వరుసలో గాక, రెండు వరసలలో నున్నవి. ఏ మహాజ్ఞానమా యజ్ఞశాలను నిర్మించినదో, ఆ జ్ఞానము పాదములను పెంచినచో, 4+4 అక్షరములతో పెంచవలసినదని చెప్పుచున్నట్లున్నది. అందువలననే, వేదము గాయత్రీ ఛందస్సునందున్న 24 అక్షరములకు, ఇంకొక నాలుగు అక్షరములను కలిపి, 28 అక్షరముల ఉష్ణిక్ ఛందస్సును చేసినది. ఉష్ణిక్కునకు మరియొక నాలుగు కలిపినచో, మొత్తము 32 అక్షరములే కాక, 4వ పాదమమరినది. 32 అక్షరములతోడ, నాలుగు పాదములుగా అనుష్టుప్ ఏర్పడినది.

ఈ విధముగా వేదమునందు మొదటి ఏడు ఛందస్సు లేర్పరచబడినవి. యజ్ఞశాలవంక మరియొకసారి చూచినచో, అ, ఈ, ఊ – అనిన అచ్చులను లెక్కింపనిచో, ప్రతిపాదమున వర్ణములు ఏడు. ఛందస్సు మనస్సునకు వర్ణము కల్పించుటకొరకు. అనగా మనస్సును ఋక్కులోని భావమువంకకు త్రిప్పుటకొరకు. ఛందస్సునందు వర్ణము ప్రధానము. పాదమునకు ఏడు వర్ణములు కనుక, ఏడు ఛందస్సులు. మూడు పాదములు కనుక, వేదఛందస్సులు మూడు వర్గములుగా కనపడుచున్నవి.

ప్రథమ వర్గము

1. గాయత్రీ 2. ఉష్ణిక్ 3. అనుష్టుప్ 4. బృహతీ 5. పఙ్క్తి 6. త్రిష్టుప్ 7. జగతీ

ద్వితీయ వర్గము

1. అతి జగతీ 2. శక్వరీ 3. అతి శక్వరీ 4. అష్టి 5. అత్యష్టి 6. ధృతి 7. అతి ధృతి

తృతీయ వర్గము

1. కృతి 2. ప్రకృతి 3. ఆకృతి 4. వికృతి 5. సంకృతి 6. అభికృతి 7. ఉత్కృతి

వర్ణమునకొక ఛందస్సుగా, వేదము ఋక్కులలోని అర్థమును అక్షరస్పర్శన స్థానమార్గముగా మనలోని జ్ఞానమును చేరు పద్ధతినేర్పరచినది. అదియే ఛందస్సు.

ప్రథమ వర్గమునందలి ఏడు ఛందస్సుల వివరణముః

| **ఛందస్సు** | **పాదములు** | **అక్షరములు (పాదములోని)** | **మొత్తము అక్షరములు** |
|---|---|---|---|
| గాయత్రి | 3 | 8+8+8 | 24 |
| ఉష్ణిక్ | 3 | 8+8+12 | 28 |
| అనుష్టుప్ | 4 | 8+8+8+8 | 32 |
| బృహతి | 4 | 8+8+12+8 | 36 |
| పజ్తి | 5 | 8+8+8+8+8 | 40 |
| త్రిష్టుప్ | 4 | 11+11+11+11 | 44 |
| జగతీ | 4 | 12+12+12+12 | 48 |

పైన ఉన్న ఛందస్సుల వివరణము చూచినచో యీ క్రింది విషయములు తెల్లమగుచున్నవి.

1. వేదఛందస్సు ప్రధానముగా అక్షరములమీద నిర్మింపబడినది. అక్షరమునే జ్ఞానము, భావప్రకటన కుపయోగ పరచుచున్నదికాన, ఆ అక్షరమునే వేదము తిరం బ్రహ్మ జ్ఞానమును జన్మస్థానమునందు జేర్చుటకుపయోగించినది.
2. వాగ్యజ్ఞశాలలో అక్షరములను పేర్చిన విధముగానే వేదము భిన్న ఛందస్సులను నిర్మించినది. మన జ్ఞాన లక్షణమా యజ్ఞశాలలో నాట్యము చేయుటగాన, వేదము తన ఛందస్సులను ఆ శాలకు ప్రతిరూపములను చేసినది. వేదాక్షరాధ్యయనమే ప్రాణము, మనస్సు, జ్ఞానము, భావప్రకటనార్థముగాన, వేదమన్త్రభావార్థములను స్వీకరించుట కొరకునాట్యము సేయునట్లు చేసినది. వేద ఛందస్సుతోడి మన్త్రము మన వాగ్యంత్రమున ఉన్న యజ్ఞశాలకు ప్రతిసృష్టి. ఏ మార్గమునుండ జ్ఞానము తన భావమును అక్షరద్వారముగా బయటకు పంపుచున్నదో, వేదము తన భావమును ఆ అక్షరద్వారమునుండియే మన జ్ఞానమును జేర్చుచున్నది. వేదమునకు మన జ్ఞాన, వాగ్యంత్రముల మధ్యనున్న దారి తెలుసును. ఆ దారినే వేదము ఛందస్సు అనినది. దాని తోడనే వేదమంతయు నిర్మింపబడినది. వేదమన్త్రము మూలజ్ఞానమును కదిపి, అందలి భావములను, ఊహలను మార్చుననుటలో ఆశ్చర్యమేమున్నది!

వాగ్యజ్ఞశాలయందు, ఎచ్చట అక్షరములు పుట్టుచున్నవో, ఆ స్థానములకు కపాలము–లని పేరు. కపాలము వేదశబ్దము. దానికిని సంస్కృతభాషలోనున్న కపాల శబ్దమునకును సంబంధము లేదు. కపాలము వద్దనే అక్షరము పుట్టును. ఆ అక్షరమును పుట్టించు శక్తిపేరు **వసవః**. అవి ఎనిమిది. వాని వలననే మన యజ్ఞశాలయందు ప్రతిపాదమునకు

8 కపాలములున్నవి. ఒక్కొక్క వసువున కొక్కొక్క కపాలము. ఈ అష్ట వసువులను ప్రేరేపించు శక్తి అగ్ని. అగ్ని స్తుతులన్నియు గాయత్రీ ఛందస్సులోనే యుండును.

**అష్టౌ వసవోఽష్టాక్షరా గాయత్రీ,**
**ఏకాదశరుద్రా ఏకాదశాక్షరా త్రిష్టుప్,**
**ద్వాదశాఽఽదిత్యా ద్వాదశాక్షరా జగతీ** – కృష్ణయజుర్వేదము (3–4–9)

వసువులు ఎనిమిది. అందువలన గాయత్రి పాదమున 8 అక్షరములు. రుద్రులు పదకొండు. అందువలన త్రిష్టుప్ పాదమున 11 అక్షరములు. ఆదిత్యులు పన్నెండు. అందువలన జగతీ ఛందస్సు పాదమునందుఅక్షరములు 12.

**వసవస్త్వా ప్రహృహన్తు గాయత్రేణ ఛన్దసాఽగ్నేః ప్రియం పాథఉపేహి**
**రుద్రాస్త్వ ప్రవృహన్తు త్రైష్టుభేన ఛన్దసేన్ద్రస్య ప్రియం పాథ ఉపేహి**
**ఆదిత్యాస్త్వా ప్రవృహన్తు జాగతేన ఛన్దసా విశ్వేషాం దేవానాం ప్రాయం పాథ ఉపేహి**
– కృష్ణయజుర్వేదము (3–3–3)

గాయత్రీ ఛందస్సు వలన విదితములగుచున్న వసువులు అగ్నిదేవతా జ్ఞానము కలిగింతురుగాక!
త్రైష్టుభ ఛందస్సుచేత విదితములగుచున్న రుద్రులు ఇన్ద్రదేవతా జ్ఞానమును కలిగింతురుగాక!
జగతీ ఛందస్సుచేత వివరింపబడిన ఆదిత్యులు విశ్వదేవతా జ్ఞానమును కలిగింతురుగాక!

వసువుల సమిష్టిస్వరూపమే అగ్నిదేవత. రుద్రుల సమైక్యభావమే ఇన్ద్ర శక్తి. ఆదిత్యసమూహమే విశ్వదేవతలు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు మనలోనున్న శక్తులు. వాటి స్వరూపము, వాటికి మూలమైన అగ్ని, ఇన్ద్ర, విశ్వేదేవతా శక్తుల లక్షణములు వివరించుటకొరకే వేదఋక్కులు అవతరించినవి.

అగ్ని సంబంధమైన ఋక్కులన్నియు గాయత్రి ఛందస్సులో నుండును. ఇన్ద్రదేవతా స్తుతులు త్రైష్టుభములు. విశ్వదేవతా ఋక్కులు జగతీ ఛందస్సులో నుండును.

అగ్ని మూడు పాదములుగా విడివడి, పాదమునకు ఎనిమిది వసువులుగా యజ్ఞశాలయందున్నది గదా! సంజ్ఞానమునుండి వచ్చిన జ్ఞానరూపమైన ఊహను, అక్షరరూపముగా మార్చుటకు 24 కపాలములతో సిద్ధముగా నున్న అగ్నిని తెలియుట ఎట్లు? మూడు పాదములుగా, పాదమున కెనిమిదిగా నున్న కపాలములను అక్షరములతో నింపినచో, ఆ వసవులు కదలును. అష్ట వసవుల సమిష్టి స్వరూపమే అగ్నిదేవత కావున, అగ్నిని కదిలించిన వారగుదుము. జ్ఞానమైన భావమును అక్షరము సేయుటకు బదులు, అక్షరములోని భావమును జ్ఞానమును చేసి, సంజ్ఞానమున కందించును.

**కరోత్యష్టా కపాలః కార్యః అష్టాక్షరా గాయత్రీ గాయత్రోఽగ్నిః**
**గాయత్రచ్ఛన్దాః స్వేనైవైనం ఛన్దసా సమర్ధయతి** – కృష్ణ యజుర్వేదము (3–5–4)

అష్టకపాలములున్న కార్యము చేయుము. గాయత్రి అష్టాక్షరములు కలిగినది. గాయత్రియే అగ్ని. గాయత్రి ఛందస్సు. ఛందస్సు ఆ అగ్నిని సమర్ధించును.

అగ్ని మనలోనున్న శక్తి. అగ్నిని తెలుసుకొనుట యనగా, మనలోనున్న శక్తిని మనము తెలుసుకొనుట. మూలజ్ఞానమునుండి కపాలములవరకు దారులున్నవి. దేవతాశక్తులా దారులవెంట, జ్ఞానభావములను తెచ్చుచున్నవి. వేదమా దారులను మూలజ్ఞానమునకు బ్రహ్మభావము తెలియజెప్పుటకు ఉపయోగించుచున్నది. ఆ ఉపయోగించు పద్ధతికి ఛందస్సు అని పేరు.

కపాలములయందు అక్షరములుద్భవించువేళ, అచ్చట ఉన్నవి జ్ఞానము, దేవతాశక్తి మాత్రమే కాదు. ప్రాణము, మనస్సు గూడ నున్నవి. ప్రాణమే పలికించునది. మనస్సే ఆ అక్షరము వెలికి వచ్చుటకు అంగీకరించినది. వేదాక్షరము, ప్రాణమును చాల భద్రముగా చూచును.

**ఉచ్చాతే జాత మన్ధసో**
**దివిష ద్భూమ్యాదదే**
**ఉగ్రం శర్మమహిశ్రవః** – ఋగ్వేదము (9–61–10)

ఈ ఋక్కు ఛందస్సు గాయత్రి. ప్రతి పాదమునందు ఎనిమిది అక్షరములుండవలెను గదా! రెండవ పాదము నందు ఏడు అక్షరములు మాత్రమే ఉన్నవి. కనుక ఆలోచింపవలెను. మనము అక్షరములనెట్లు పలుకగలుగుచున్నాము? ఊపిరితిత్తులలో ఉన్న గాలినుండి చిన్న చిన్న ముక్కలను తెచ్చి, అక్షరమునకొక ముక్కగా వాడుచున్నాము. బయటకు వచ్చు గాలికి వేదమునందు పేరు అపానము. అపానవాయుగుళికలు అక్షరములగుచున్నవి. (అపానము వేదశబ్దమగుటచేత, సంస్కృత శబ్దార్థము చెప్పరాదు). పైన చెప్పబడిన ఋక్కు రెండవ పాదమునందు మధ్యనున్న మూడక్షరములు **షద్భూమ్యా**. ఇందు **ష** ఊష్మము. ఊష్మమునందు ఎక్కువ గాలి ఖర్చగును. **ద్భూ** అనిన అక్షరమునందు ఎక్కువ **దూ** కు తోడు **భ** ఉన్నది. **భ** పలుకుటకు మామూలు అక్షరమునకుకన్న ఎక్కువ గాలి కావలెను. తరువాతి అక్షరము **మ్యా**. **మా** నాసిక్యము. గాలి ప్రతిధ్వనించు చోటు. నాసికాబలము శిరస్సునందు. **యా** పలుకవలసినది నాలిక మీది మధ్య భాగమునందు. పైన నాసికా బిలములోనున్న గాలి క్రిందకు రాదు. క్రొత్త వాయు గుళికను తీసుకొని రావలెను. ఎడమ ప్రక్కన ఉన్న **ధూ** పలుకుటకు తెచ్చిన గాలి ముక్కలో సర్దుకొనుటకు లేదు. **భ** ఆ గాలిని పూర్తిగా వాడివేసినది. రెండక్షరముల వెనుకకు పోయినచో, **ష** అనిన ఊష్మముండి, ఏ కొంచెము గాలిని మిగల్చలేదు. మూడక్షరములకొరకు తెచ్చిన మూడు గాలి ముక్కలు సరిపోవుటలేదు. నాల్గవ గాలిముక్కను తెచ్చినగాని, **యా**– ను పలుకలేము. ఆ పలుకవలసిన నాల్గవ అక్షరము మామూలు అక్షరము కూడ కాదు. అంతస్థము(య, ర,

ల, వ – లలో ఒకటి) అంతస్థములను పలుకుటకు ప్రయత్నమెక్కువ. అనగా గాలిముక్క కొంచెముపెద్దది. కనుక, **షద్భూఖమ్యా** , అని పలుకుటకు మూడుగాక, నాలుగు గాలిముక్కలు కావలసి వచ్చెను. రెండవపాదము పలుకుటకు ఎనిమిది గాలిముక్కలు కావలెను. వేదము బయటకు వినబడు శాబ్దికమైన అక్షరమునుగాక, వెనుకనున్న గాలి ముక్కలను అక్షరములనుచున్నది. గాయత్రీ పాదమునుచ్చరించుటకు ఎనిమిది అపానవాయుగుళికలు కావలెను. అవియే అక్షరములు. గాయత్రి పాదమునందు ఎనిమిది వాయుగుళికలను ఉపయోగించు విధముగా శాబ్దికాక్షరములను పేర్చుటకు ఛందస్సు అని పేరు. వేదఛందస్సు కావ్యఛందస్సువలె వట్టి అక్షరములను గణములుగా పేర్చుట కాదు. ప్రాణమునకు ప్రధానమైన అపానవాయువును జాగ్రత్తగా, పరమ ప్రయోజనకరముగా వాడుట. కనుక వేదఛందస్సు ప్రాణ సంబంధి. వేదఛందస్సును చూచినచో, జ్ఞానము అపానవాయువునెట్లు ఉపయోగించుచున్నదో తెలియును.

ఏ భావము జ్ఞానమును చేరవలెనన్నను, మనస్సు ప్రధానము. ఎంత మంచి వస్తువునైనను జూపించుము. ఇష్టము లేనిచో ఏమందుము? వస్తువు మంచిదే కాని, మనస్సు దానివంకకు పోవుట లేదందుము. వంకకు పోవుట అనగా మనస్సు దృష్టి ఆవైపునకు తిరుగుట కదా. ఈ మనోదృష్టికి ఇన్ని వంకలు అని చెప్పలేము. ఎందుకనగా మనస్సు అన్ని స్థితులలో ఉండగలదు. కావ్యాలంకార శాస్త్రములందు ఈ మనస్థ్సితులకు రసములని పేరు. శృంగారము, కరుణ, భీభత్సము మొదలైనవి అందరకు తెలిసినవే. మనస్సా స్థితియందున్నప్పుడే, ఆ పరిస్థితివంక దృష్టితో ఉన్నప్పుడే ఆ రసానుభూతి కలుగును. అనగా కవి ఏది చెప్పెనో దానియందు మనమేకమగుదుము. కావ్యములు మనోరంజకత్వము కొరకు కనుక, రసము వద్ద ఆగిపోవును. పుస్తకము మూసివేసెదము; కొన్ని నిమిషములలో మనము మనమే.

వేదమునందట్లు కాదు గదా! ఈ ఋక్కులలోని, సామములలోని, యజస్సులలోని భావములు మూల జ్ఞానమును చేరవలెను. ఆ భావములు బ్రహ్మజ్ఞాన కారకములు. బ్రహ్మజ్ఞానమనగా, బ్రహ్మాండముయొక్క, విశ్వము యొక్క, సృష్టియొక్క సంపూర్ణజ్ఞానము. ఆ జ్ఞానమును మెట్లు మెట్లుగా ఎక్కవలెను గాని, ఒక్కసారిగా చేరలేముగదా! మనస్సు యొక్క దృష్టిని మెట్లుమెట్లుగా పైకి ఎక్కింపవలెను. వేదమీ దృష్టులను ఋషు–లని పిలిచినది. ఆయా ఋషి స్థితిలో మనసున్నప్పుడు, ఆ ఋక్కులోని భావము మూలజ్ఞానమును జేరును. జ్ఞానము బ్రహ్మకు సంబంధించినద కాన దేవతాశక్తి. భావము మనస్సంబంధి. బ్రహ్మమైన జ్ఞానమును కలిగించు శక్తులకు దేవతాశక్తులని పేరు.ఆ శక్తులచేత, ఇప్పటికన్న ఎక్కువగా పనిచేయించి, ఉత్తమ స్థితిని పొందుటకే వేదమన్త్రములు. జ్ఞానసముద్రము నుండి వెలువడు భావములను, మనస్సు వాగ్రూపముగా వెలికి తెచ్చుచున్నది. ఆ మనస్సే వినిన వాక్కును భావమును జేసి, జ్ఞానము నకందించుచున్నది. పైపై జ్ఞానపు పొరలకు కావ్యములందలి భావములనందించు మనస్సు యొక్క స్థితికి **రసస్థితి** అని పేరు.కాని మూలజ్ఞాన విషయమున మనస్సు ఉండెడి స్థితులు వేరు. అది రసస్థితి కాదు. **ఋషి స్థితి.** మనలోనున్న దేవతాశక్తులు బాగుగా పనిచేయుట లేదు. అందువలన మన మూలజ్ఞానము కొరతలో నున్నది. ఈ దేవతా శక్తులను దృఢపరచుటకొరకే వేదమన్త్రములు. అందువలననే ప్రతి ఋక్కుకు, ప్రతి సామకు, ప్రతి యజస్సునకు దేవత

నిర్ణయింపబడినది. అనగా వేదమునందున్న బ్రహ్మజ్ఞానము దేవతావిషయకముగా విభాగింపబడినది. అట్లు విభాగము చేయనిచో, బ్రహ్మ జ్ఞానము నంతను ఒక్కసారి మ్రింగగల శక్తి మనకు లేదు.

ఋషి తెలియనిచో మనస్సు ఋక్కునందలి అక్షరములందు బ్రహ్మజ్ఞానముగా మారు భావములను చూడలేదు. అనగా మనస్సు గమ్యమైన బ్రహ్మజ్ఞాన దృష్టితో నుండదు. వేదఛందస్సు బ్రహ్మజ్ఞానమును తెలియ జేయుటకు కావున, ఋషి, వేదఛందస్సునందు ఒక ముఖ్యమైన భాగము.

దేవత : అగ్ని, ఋషి : వసుశ్రుత ఆత్రేయః, ఛందస్సు : విరాట్ స్థానా త్రిష్టుప్
త్వమగ్నే వరుణో జాయసే (9)
యత్త్వం మిత్రో భవసి యత్ సమిద్ధః (11)
త్వే విశ్వే సహసస్పుత్ర దేవా (10)
స్త్వమిన్ద్రో దా శుషే మర్త్యాయ (9)
ఋగ్వేదము, 5వ మండలము, 3వ సూక్తము, మొదటి ఋక్కు

పంచమ మండలమునందున్న మూడవ సూక్తమునందు 12 ఋక్కులున్నవి. ఇది మొదటిది. తక్కినవన్నియు త్రిష్టుప్ ఛందస్సులోనున్నవి. ఇది మాత్రము విరాట్‌స్థానా త్రిష్టుప్‌లోనున్నది. త్రిష్టుప్పులందు చాల రకములున్నవి. అందు విరాట్ స్థానమొకటి. ఇది విరాట్ స్థానమునందెందుకున్నది? అర్థము చూచినచో తెలియును.

నీవే వరుణదేవతయందున్న అగ్నివి.
నీవే మిత్రదేవత యందున్న అగ్నివి.
నీవే దేవతాభావములను ప్రజ్వలింపజేయు సమిద్ధాగ్నివి.
విశ్వేదేవతలందున్న అగ్నివి నీవే.
నీవే ఇన్ద్రాగ్నివి.
నా యత్నము, నా మనస్సు, నేను ఉన్నచోటు ఆయా – దేవతాప్రాణ శక్తులను కల్పింపుము.

ఈ మన్త్రము ఏ ఒక్క దేవతను గురించి కాదు. సకల దేవతల ప్రాణశక్తియైన అగ్నిని గురించి. అది విరాట్ స్వరూపము. అందువలన ఇది విరాట్‌స్థానాత్రిష్టుప్. విరాట్ త్రిష్టుప్పులలో ఇంక రెండు త్రిష్టుప్పులున్నవి. వాటి పేర్లు– విరాట్ పూర్వా త్రిష్టుప్, విరాట్‌రూపా త్రిష్టుప్. ఇచ్చట ఉన్నది విరాట్‌స్థానాత్రిష్టుప్. ఎందుకనగా, ఈ అగ్ని చేరవలసిన స్థానము యీ ఋక్కు చెప్పుచున్నది. మర్త్యాయ – అనిన చివరి శబ్దమునందలి **ర్త్యా** అనిన అక్షరము ఆ స్థానమును చెప్పుచున్నది. **ర**–కారము జీవుడు. **త**– కారమూ జీవుని స్థానము. **య**– కారము జీవుని నిత్యయజ్ఞము, లేక యత్నము తెలియజేయును. కనుక, **ర్త్య**–జీవుని స్థానము. ఆ స్థానమును తెలియజేయుటకు వేదము త – కారము వాడును. ఆ స్థానమునకు ప్రతిష్ఠ మరియొక పేరు. వేదమునందు ప్రతిష్ఠామన్త్రములున్నవి. ఆ మన్త్రములు త–కారములతో నిండి

యుండును. ఈ ఋగ్భావముగూడ త-కు పోవలయును గనుక, ఇందు త-కారములు ఎక్కువ యుండును. త్వమగ్నే, యత్త్వమ్, మిత్రో, యత్సమిద్ధః, త్వే, పుత్ర, త్వమిన్ద్రో, మర్త్యాయ.

ఈ ఋగ్భావము త-ను జేరవలెను గాన, ఈ మన్త్రము ఆత్రేయము. మనస్సు ఆత్రేయమవవలెను. జీవుని స్వస్థానమందీ భావమైక్యమగుటను భావించవలెను. త-కార స్థానమును జేరవలసిన మన్త్రములన్నిటికిని ఋషి ఆత్రేయమే. పంచమమండలమందలి మొదటి 20-సూక్తములు ఆత్రేయములే. వాటి అన్నిటి గమ్యస్థానము- త. ఆత్రేయ శబ్దమునందు త-కార, ర-కారములున్నవని మరువరాదు. ఈ ఋక్కు వసుశ్రుతమైన ఆత్రేయము. ఇచ్చట అగ్నిని సమిష్టి అగ్నిగా గాక, వసుగణమైన అగ్నిగా చూడవలెను. ఎందువలన అనగా, ఇందు అనేక దేవతలు చెప్పబడినవి. ఏ దేవతా అగ్ని వస్తువులా దేవతాగ్నివి. అందువలన, ఆ ఋక్కు పఠించువేళ మనస్సు అగ్ని శ్రుతము కాక, వసుశ్రుతమ వవలెను. కనుక ఇచ్చట ఋషి వసుశ్రుత ఆత్రేయము. ఋషి విషయము తెలియక, ఋషి దృష్టి లేక, ఈ ఋక్కు అర్థ మగునా? వేదమన్త్రములకు విపరీతార్థములు వ్రాయుటకు ఋషిదృష్టి లేకపోవుట ఒక కారణము.

ఒక్కొక్క ఋషి దృష్టియందు ఏమేమి, ఎన్నెన్ని మెట్లు ఉన్నవి? బ్రహ్మజ్ఞానమును చేరుటకు ఎన్ని మనస్థితులు (ఋషి దృష్టులు) ఉన్నవి? వివరములు సామవేద బ్రాహ్మణమైన వంశబ్రాహ్మణమందున్నవి. ఋషి శబ్దములను పురాణమందలి మునీశ్వరుల నామములుగా చూడరాదు. వేదమవతరించినపుడు ఋషులు లేరు. అది సృష్టి ప్రథమము.

**యశ్ఛందసా వృషభో విశ్వరూపః** – అని తైత్తిరీయ బ్రాహ్మణము.

ఛందస్సునుండియే విశ్వరూపము వృషభమైనది. వృషభమగుట యనగా క్రమముగా రూపమునొందుట. ఆ ఛందస్సు, దేవతను, ఋషిని, మనస్సును, ప్రాణమును, అక్షరరూపమైన వాక్కునందు సంహితజేసి, ఆ మహా సంహితకు వేదము, అను ఆకారము (ఆయతనము) కల్పించి, ఆ వేదజ్ఞానమును మూలజ్ఞానము జేర్చుటకు యజ్ఞమేర్పరచినది.

ఏ బ్రహ్మము ఛందో రూపముతో వేదాక్షర విశ్వమును నిర్మించినదో, ఏ బ్రహ్మజ్ఞానము వేదఛందస్సు ద్వారా తిరిగి స్వస్థానము చేరుచున్నదో, ఏ బ్రహ్మమునకును, వేదమునకును, ఛందస్సునకును భేదములేదో, అట్టి బ్రహ్మజ్ఞానప్రతిరూపమైన వేదఛందస్సునకు నమస్కారము.